సాక్షి ప్రకాశం

బుధవారం | 12 | జూలై | 2023



పవన్..డౌన్ డౌన్

వలంటీర్లపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిరసనలు నిర్వహించారు. కంభంలో వలంటీర్లు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. - 8లో..



లక్ష గడపల్లో సంతోషం చూశా

వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని లక్ష గడపల్లో పూర్తి చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 36/28

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.



క్షణాల్లో.. ప్రాణాలు గాల్లో..





ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్



మృతిచెందిన షేక్.సబీనా



అబ్దుల్ ఉమ్మే హనీ



జానీబేగం



నూర్జహాన్



బాలిక షీమా మృతదేహం వద్ద విలపిస్తూ..

- పెళ్లి ఇంట పెను విషాదం
- ఉలిక్కి పడిన పొదిలి
- నాలుగు కుటుంబాలకు కోలుకోలేని దెబ్బ
- మిన్నంటిన రోదనలు
- మృతుల్లో అక్క చెల్లెలు, అత్త కోడలు
- మౌలానా కుటుంబంలో ముగ్గురు
- మతపెద్ద సహా, భార్య, మనమరాలు మృతి
- కదిలిన ఉన్నతాధికారులు
- సకాలంలో స్పందించిన స్థానికులు
- దర్శిలో మిన్నంటిన రోదనలు

పెళ్లి సందడి సంతోషం.. అంతలోనే అంతులేని విషాదం. రిసెప్షన్ సంబరాలను ఊహించుకుంటూ బయలుదేరిన కొద్ది సేపటికే ఊహలు సమాధి అయ్యాయి. అర్ధరాత్రి..అంతా చిమ్మ చీకట్లు.. ఏం జరిగిందో తెలుసుకునే లోపు ఏడుగురి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. అప్పటి వరకూ తమతో సంతోషంగా గడిపిన వారు ఇకలేరు అన్న విషయం వారి బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. గాయపడిన ఆప్తులు ఒక వైపు, అయిన వారి మృతదేహాలు మరో వైపు బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను పొదిలికి తరలించిన సమయంలో వారి గృహాల వద్ద తీవ్ర ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. దర్శి వద్ద సాగర్ కాలువలో బోల్తాపడిన ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటన నాలుగు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది.



ప్రమాదస్థలంలో సహాయక చర్యలు చేస్తున్న అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది

దర్శి/పొదిలి/పొదిలి రూరల్/కొనకనమిట్ల:

పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో గౌస్ మొహిద్దీన్ కుటుంబం నివాసముంటోంది. ఆయన కుమారుడు సిరాజ్ సౌదీలో ఉంటున్నారు. వారితో పాటు ఆయన ఉంటున్నాడు. కుమార్తె ఫాతిమాను కాకినాడకు చెందిన అక్బర్ షరీఫ్‌తో వివాహం చేయాలని నిశ్చయించారు. వివాహం ఘనంగా జరపాలని తలంచారు. సౌదీ నుంచి అందరూ పొదిలికి చేరుకున్నారు. గత ఆదివారం పట్టణంలో అంగరంగ వైభవంగా కుమార్తె వివాహం జరిపించారు. రిసెప్షన్ కాకినాడలో పెట్టుకున్నారు. బంధు మిత్రులను పొదిలి నుంచి తీసుకెళ్లేందుకు ఒంగోలు ఆర్టీసీ డిపోకు చెందిన ఇంద్రా బస్సును అద్దెకు తీసుకున్నారు. రాత్రి పది గంటలకు బయలుదేరి, తెల్లవారి ఆరు గంటలకు కాకినాడ చేరుకుంటారు. పగలంతా ఫంక్షన్‌లో ఉండి, రాత్రికి బయలు దేరి పొదిలికి చేరుకోవాలనేది వారి ఆలోచన. ఒక్క డ్రైవర్ అయితే ఇబ్బంది ఉంటుందని ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి రెండో డ్రైవర్ కూడా అవసరమని చెప్పారు. ఇద్దరు డ్రైవర్లతో రాత్రి 12.15 గంటలకు బయలు దేరారు. బస్సులో బంధుమిత్రులు కొందరు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. మరి కొందరు నిద్ర పోతున్నారు. సరిగ్గా బస్సు బయలు దేరిన 20 నిముషాల్లోపే ఒక్క సారిగా డివైడర్‌ను ఢీకొట్టిన బస్సు కాలువలో ముందు వైపు కిందకు వేలాడినట్లు పడింది.

దీంతో బస్సులో ఉన్నవారంతా ఒక్క సారిగా ముందుకు పడ్డారు. ఒకరిపై ఒకరు పడి ఏం జరిగిందో అర్థం కాక హాహాకారాలు చేశారు. సీట్లలో నుంచి అందరూ ఒక్కసారిగా కింద పడి పోవడంతో ముందున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. అంతా చిమ్మ చీకట్లు.. ఏం జరిగిందో తెలియక ఎలా బయటకు రావాలో అర్థం కాక తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ వైపు నుంచి బయటకు వచ్చిన కొందరు తమ బంధువులకు ఫోన్‌లు చేసి జరిగిన విషయం తెలిపారు. బస్సు డ్రైవర్ రమేష్ 100కి సమాచారం అందించాడు.

అత్త, కోడలు మృతదేహాలు ఒకేసారి...

పెండ్లికుమార్తె పెద్ద మేనత్త ముల్లా నూర్జహాన్ (58), ఆమె కోడలు సబియా ప్రమాదంలో మృతి చెందారు. రెండు మృతదేహాలు ఒకే సమయంలో ఇంటి వద్దకు చేరుకోవటంతో కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్నారు. కోడలు పెళ్లి చూశాం.. రిసెప్షన్ కూడా చూసి రావాలని కాకినాడ బయలుదేరిన వారు, తిరిగిరాని లోకాలకు చేరారని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

రిసెప్షన్‌కు వెళ్లి..అందరినీ చూడాలని...

పెండ్లికుమార్తె బంధువు అయిన ముల్లా జానీబేగం (65) రిసెప్షన్‌కు వెళ్లి బంధువులు అందరినీ చూడాలని బస్సులో బయలుదేరింది. కానీ దురదృష్టవశాత్తూ జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. వయసు మీద పడుతోంది కదా.. అందరినీ చూడాలి అన్న ఆమె కోరిక తీరకుండానే తిరిగిరాని లోకాలకు చేరిందని కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరు ఉపాధ్యాయుడు కాగా, మరొకరు రైల్వే పోలీసుగా పనిచేస్తున్నారు.



వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి

మృతుల్లో చెన్నై డీఎస్పీ భార్య...

పెండ్లికుమార్తె మేనత్త షేక్.రమీజ్ మృతుల్లో ఒకరు. రమీజ్ భర్త రియాజుద్దీన్ చెన్నైలో డీఎస్పీగా పనిచేస్తున్నారు. వివాహం కోసం కుటుంబంతో సహా అందరూ పొదిలికి వచ్చారు. తదుపరి తాను కాకినాడకు బస్సులో రాలేనని చెప్పి, రైల్లో రిజర్వేషన్ చేయించుకుని బయలు దేరాడు. తెనాలి చేరే సరికి రియాజుద్దీన్‌కు బస్సు ప్రమాదం జరిగి, అందులో భార్య మృతి చెందిందనే వార్త చేరింది. అక్కడ నుంచి తిరిగి పొదిలికి చేరుకున్నారు. భార్య మృతదేహాన్ని చూసిన రియాజుద్దీన్, వారి కూతురు కన్నీరుమున్నీరుగా విలపించారు. రమీజ్ మృతదేహాన్ని చెన్నైకి తరలించారు. ఇదిలా ఉండగా ఈ ప్రమాదంలో మృతిచెందిన నూర్జహాన్ డీఎస్పీకి వదిన.



రోదిస్తున్న చెన్నై డీఎస్పీ రియాజుద్దీన్

వెంటనే స్పందించిన పోలీసులు

ఘటన జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి నేతృత్వంలో సీఐ జే రామకోటయ్య, ఎస్సై రామకృష్ణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్, పొక్లెయిన్, బుల్డోజర్‌లను తెప్పించి బస్సులో ఇరుక్కున్న వారిని బయటకు తీసుకొచ్చారు. నిముషాల వ్యవధిలోనే ఐదు 108 వాహనాల్లో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. బయటకు తీసేవారిని పోలీసులు పరామర్శించి వారి పరిస్థితిని బట్టి ఆస్పత్రులకు తరలించారు. లగేజీలు కూడా వారి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈలోపే కొందరు డ్రైవర్ వైపు డోరు నుంచి బయటకు రాగా మరి కొందరు లోపలే ఇరుక్కుపోయారు. లోపలి వైపు ఇరుక్కుపోయిన వారిని అగ్నిమాపక సిబ్బంది బస్సులోకి వెళ్లి బయటకు తీశారు. క్రేన్ సాయంతో కాలువలో నుండి రోడ్డు పైకి తీసుకొచ్చారు. ఆ తరువాత మృతి చెందిన 6 మృత దేహాలను క్రేన్‌ల సాయంతో బయటకు తీశారు. బస్సు కింద ఇరుక్కుపోయిన చిన్నారి షీమాను అతికష్టం మీద వెలికి తీశారు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్పీ మలికా గర్గ్ ఉదయం 5 గంటలకే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షించారు. మృతుల బంధువులను ఓదార్చారు. దాదాపు నాలుగు గంటలపాటు ఆమె ప్రమాద స్థలంలోనే ఉన్నారు.



ప్రమాదస్థలంలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

మౌజన్.. కుటుంబంలో ముగ్గురు..

ముస్లీం మత పెద్ద మౌజన్ అబ్దుల్ అజీజ్ (60)తో సహా, అతని భార్య అబ్దుల్ ఉమ్మే హనీ (58), మనుమరాలు షేక్.షీమా (6) ప్రమాదంలో మృతి చెందారు. పెండ్లికుమార్తె తాత గౌస్‌మొహిద్దీన్ కుటుంబానికి, అజీజ్ కుటుంబానికి 40 సంవత్సరాలుగా స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అజీజ్ కుటుంబ సభ్యులు అందరూ బస్సులో వెళ్లారు. 1978వ సంవత్సరంలో అజీజ్‌ను మత పెద్దగా నియమించారు. అప్పటి నుంచి పొదిలిలోనే ఉన్న అజీజ్, గుంటూరుకు చెందిన ఉమ్మే హనీ అనే ఆమెతో వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డారు. అప్పటి నుంచి పెండ్లికుమార్తె నాన్న సిరాజ్ కుటుంబానికి, అజీజ్ కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. మత పెద్దగా పట్టణంతో పాటు, సమీప గ్రామాల వారికి ఆత్మీయుడుగా అజీజ్ ఉన్నారు. ఆప్యాయంగా పలకరించడం, సమస్య ఏదైనా చెబితే సానుకూలంగా స్పందించటం, తన వంతుగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తూ, అందరి మన్ననలు పొందాడు. అజీజ్ మృతి చెందారనే వార్త తెలియటంతో పెద్ద సంఖ్యలో ఆయన్ను చివరిసారి చూసేందుకు భారీ సంఖ్యలో ముస్లింలు మసీదు వద్దకు చేరుకున్నారు. అజీజ్, హనీ, షీమా మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు రోదనలు మిన్నంటాయి. తనను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులు, తాను మురిపెంగా అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కూతురు మృతి చెందటంతో మౌనంగా రోదిస్తున్నాడు అజీజ్ కుమారుడు ఇదయతుల్లా. ఆయనను ఓదార్చటం ఎవరివల్ల కాలేదు.



అజీజ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

అద్దం పగులగొట్టి బయటకొచ్చాను



తల్లిదండ్రులు, కుమార్తె ప్రమాదంలో మృతి చెందారు. వారిని బతికించుకోవాలని తపన పడ్డాను. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. ఒకరిపై ఒకరు పడి ఉన్నారు. ఊపిరి ఆడటం లేదు. ఈ పరిస్థితుల్లో నేను అద్దం పగులగొట్టుకుని బయటపడ్డాను. కుమార్తె మృతదేహం బయటకు తీయటమే కష్టంగా మారింది.

– ఇదయతుల్లా, క్షతగాత్రుడు

ఏం జరిగిందో అర్థం కాలేదు



పొదిలి నుంచి కాకినాడకు నిఖా తర్వాత జరిగే వలిమా కార్యక్రమానికి ఏర్పాటు చేసుకున్న ఆర్టీసీ బస్సులో రాత్రి బయలు దేరాం. అర్ధ రాత్రి కావడంతో నిద్రలోకి జారుకున్నాం. ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. బస్సులోని వారంతా పెద్దగా అరుపులు కేకలు వేస్తున్నారు. మెళకువ వచ్చి చూస్తే ఏం జరిగిందో అర్థం కాలేదు. కుదుపుతో మళ్లీ స్పృహ కోల్పోయాను. కళ్లు తెరిచే సరికి ఆస్పత్రిలో ఉన్నాను.

– చికిత్స పొందుతున్న సబీర్‌ముల్లా

గాయపడిన వారు వీరే

ప్రమాదంలో ముల్లా మునీర్ బాషా, షేక్ యజ్దాన్, షేక్ షాహిద్, ముల్లా షాబ్బీర్, ముల్లా మాజా మున్నీసా, ముల్లా నజియా, షేక్.సాహిద్ బాషా, షేక్ ఆఈషా జుబేరా, షేక్ సిరాజ్, షేక్ సాహిద్, ఆర్ ముబీన్, షేక్ ఉమేహిని, షేక్ సలీమునీసా, షేక్ రహమత్, షేక్ హిదాయతుల్లా, షేక్ గౌసియా బేగం, ముల్లా మాసమాబేగం, సారెడ్డి పెద్దిరెడ్డిలు గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఏం జరిగిందో...అర్థం కాలేదు:



చుట్టూ చీకటి, రాళ్లపై పడి ఉన్నాను. కొంత సేపు ఏం జరిగిందో అర్థం కాని పరిస్థితి. బస్సులో ఉన్న నేను రాళ్లపై ఎందుకు పడి ఉన్నానో అని తెలియని స్థితి. లీలగా ఒక్కొక్కటి గుర్తుకొచ్చాయి. బస్సు వాగులో పడినట్లు గుర్తించాను. బంధువులు, సామానులు, డబ్బులు, సెల్‌ఫోన్లు ఎక్కడకెక్కడో పడిపోయి ఉన్నాయి. ఒకరిపై ఒకరు పడటంతో ఊపిరి ఆడటం లేదు. జేబులో సెల్ ఉంది. 108, పోలీసులకు, బంధువులకు సమాచారం ఇచ్చాను. అద్దం పగులగొట్టుకుని బయట పడ్డాను. దూర ప్రాంతం కాబట్టి బస్సుకు రెండో డ్రైవర్‌ను కూడా పంపించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని కోరాం. పొదిలి నుంచి 12.15లు బయలు దేరాం. బస్సు బయలు దేరిన 20 నిముషాల్లోపే ప్రమాదం జరిగింది. రెండో డ్రైవరే బస్సులోని వారిని చాలా మందిని కాపాడాడు.

– ముల్లా షుకూర్, క్షతగాత్రుడు

ఎదురుగా వస్తున్న బస్సే ప్రమాదానికి కారణం

దర్శి: బస్సు ప్రమాదానికి ఎదురుగా వస్తున్న జతిన్ ట్రావెల్స్ బస్ కూడా కారణమని డీఎస్పీ అశోక్‌వర్ధన్ తెలిపారు. ప్రమాదానికి గురైన బస్‌తో పాటు జతిన్ ట్రావెల్స్ బస్‌పై కూడా కేసు నమోదు చేశారు. రెండు బస్‌లు ఎదురెదురుగా వేగంగా వచ్చాయని సాగర్ కాలువ బ్రిడ్జి పైకి వచ్చేసరికి రోడ్డు వెడల్పు తక్కువగా ఉంది. బస్సులు వేగం తగ్గించి ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉండేది కాదన్నారు. జతిన్ ట్రావెల్స్ బస్ వేగంగా రావడంతో ఢీకొంటుందనే అనుమానంతో బస్సును సైడుకు నడపడంతో పాత నీటి పైపులకు నిర్మించిన కంకర దిమ్మె తగిలి బస్సు అదుపు తప్పి ఎస్‌కేజే పవర్ ప్రాజెక్ట్ నుంచి బయటకు నీరు వదిలే కాలువ బ్రిడ్జిని ఢీకొట్టి సుమారు 20 మీటర్ల లోతు ఉన్న కాలువలో బస్సు పడిపోయింది. దీంతో బస్సులోని వారు ఒకరిపై ఒకరు పడిపోయి బస్సులో ఇరుక్కుపోయారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఎదురు వాహనానికి దారిచ్చే క్రమంలోనే ప్రమాదం: ఎస్పీ మలికా గర్గ్

ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చే క్రమంలో పెళ్లి బృందం బస్సు కాలువలో పడినట్లు ఎస్పీ మలికాగర్గ్ అంచనా వేశారు. పెళ్లిబృందం బస్సు దర్శి ఎన్ఎస్‌పీ కాలువలో పడిన సంఘటన తెలుసుకున్న ఆమె హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. బస్సు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పెళ్లిబృందంతో పొదిలి నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు దర్శి ఎన్ఎస్‌పీ కాలువ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి బ్రిడ్జిపై ఉన్న కాంక్రీట్ దిమ్మె ఎక్కిందన్నారు. దాంతో బస్సు అదుపు కాక ముందు ఉన్న బ్రిడ్జి రైలింగ్ ఢీకొని కాలువలో పడిపోయిందని చెప్పారు. ఈ ఘటనతో వెనుక వైపు ఉన్న వారు ఒక్కసారిగా ముందున్న వారిపై పడటంతో ఊపిరి అందక ఏడుగురు మృతిచెందారన్నారు. వారిలో ఒక చిన్న పాప కూడా ఉన్నట్లు ఆమె తెలిపారు. సంఘటన జరగగానే పోలీసులు, 108 సిబ్బంది, వైద్యసిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి సహాయక చర్యలు చేపట్టి బస్సులోని వారిని బయటకుతీసి ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందేలా చేశారు.

న్యూస్‌రీల్

స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై శిక్షణ

ఒంగోలు అర్బన్: ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ సమ్మరీ విజన్-2024కు సంబంధించి బీఎల్‌ఓ, సూపర్‌వైజర్, ఏఈఆర్‌ఓ, ఈఆర్‌ఓలు, రిసోర్స్ పర్సన్‌లకు స్పందన భవనంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఒకే డోర్ నంబర్‌లో పది ఓట్లకు మించి నమోదైన వాటిని గుర్తించాలన్నారు. జంక్ క్యారెక్టర్స్ తొలగించాలన్నారు. లాజికల్ ఎర్రర్స్ సరిచేసేందుకు డోర్ నంబర్ నమోదు చేసే అంశంలో జాగ్రత్తలు వహించాలన్నారు. పక్కాగా స్పెషల్ సమ్మరీ విజన్‌ను తయారు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చేందుకు, తొలగించేందుకు విధివిధానాలపై బిఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి పరిధిలోకే బీఈడీ కాలేజీలు

- హైకోర్టులో కేసు ఉపసంహరించుకున్న బీఈడీ కళాశాలల యజమానులు

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లాలోని కళాశాలలన్నింటినీ ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయానికి బదిలీ చేస్తూ ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ హైకోర్టుకు వెళ్లిన ప్రైవేటు బీఈడీ కళాశాల యాజమాన్యాలు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ యం.అంజిరెడ్డి సూచన మేరకు కేసును ఉపసంహరించుకున్నాయి. యూనివర్శిటీలో కొనసాగాలని నిర్ణయించుకున్నాయి. మంగళవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాయి. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్నీ కళాశాలలు ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో కొనసాగనున్నాయి. బీఈడీ కళాశాలలన్నీ ఆంధ్రకేసరి యూనివర్శిటీలో కొనసాగాలని నిర్ణయించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన చాన్సలర్ కళాశాలల యాజమాన్యాల అంగీకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ఇప్పటికే డిగ్రీ, పీజీ, లా, ఫార్మసీ కళాశాలన్నిటికీ గుర్తింపు ఇచ్చేందుకు విశ్వవిద్యాలయం ప్రణాళిక సిద్ధం చేసిందని, ఉత్కళ విశ్వవిద్యాలయం నుంచి ఈక్వేలెన్సీ సైతం వచ్చిందని వెల్లడించారు.

సమావేశంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ హరిబాబు, డీన్ వెంకటేశ్వరరెడ్డి, బీఈడీ కళాశాలల యాజమాన్యల ప్రతినిధి వై.వెంకటేశ్వరరావు, కే.గుండారెడ్డి, దివి రమేష్, గ్రిగొరి, సరస్వతి కాలేజీ చైర్మన్ రమణా రెడ్డి, షేక్ ఇస్మాయిల్, కే.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఈడి యాజమాన్యాల సమావేశంలో చాన్సలర్ అంజిరెడ్డి

నేటి నుంచి సాగర్ కవచ్

- రెండు రోజులపాటు బందోబస్తు

ఉలవపాడు: తీరప్రాంత రక్షణలో భాగంగా ఏడాదికి ఒకసారి జరిగే సాగర్ కవచ్ కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ (మెరైన్) పరిధిలో సీఐ కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తీర ప్రాంత బందోబస్తు నిర్వహించనున్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ బందోబస్తులో భాగంగా అన్ని స్టేషన్ల నుంచి సిబ్బంది తీసుకుని తీరం నుంచి ఎలాంటి శక్తులు జొరబడకుండా ఉండడానికి విధులు నిర్వహిస్తారు. పోలీసు శాఖ, నేవీ, కోస్టుగార్డులకు సంబంధించిన సిబ్బందే చొరబాటుదారులుగా వస్తారు. వీరిని గుర్తించి పట్టుకోవాల్సి ఉంటుంది. సాగర్ కవచ్ లో భాగంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెల్లూరు జిల్లాలోని ఉలవపాడు, గుడ్లూరు మండలాలు, ప్రకాశం జిల్లాలోని శింగరాయకొండ, టంగుటూరు తీరప్రాంతంలో విధులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ బందోబస్తులో మొత్తం 117 మంది పాల్గొననున్నారు. ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్సైలతోపాటు 108 మంది మిగిలిన సిబ్బంది పాల్గొంటారు. 46 పాయింట్లను ఈ సిబ్బందికి ఏర్పాటు చేశారు. వీరు ఆ పాయింట్ల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. రెండు రోజుల పాటు పకడ్బందీగా తీరప్రాంత రక్షణ లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలియజేశారు.



రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్



తర్లుపాడులో పవన్ దిష్టిబొమ్మ దహనం



దర్శి : పవన్ దిష్టిబొమ్మకు చెప్పులదండ వేసి ఊరేగిస్తున్న వలంటీర్లు

పవన్.. డౌన్ డౌన్..

- పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం
- క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదులు
- క్షమాపణ చెప్పకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక
- పవన్ చిత్రపటాలు, దిష్టిబొమ్మలు దహనం

సాక్షి నెట్‌వర్క్: పవన్ కళ్యాణ్ అనుచిత వాఖ్యలపై వలంటీర్లు నిప్పులు చెరిగారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై మహిళల అక్రమ రవాణాకు సహకరిస్తున్నామంటూ నిస్సిగ్గుగా ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని మహిళా వలంటీర్లతోపాటు పురుషులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ క్షమాపణ చెప్పే వరకు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు నిరసన ర్యాలీలు నిర్వహించారు. యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దారవీడు, పుల్లలచెరువు, కనిగిరి, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, తర్లుపాడు, బేస్తవారిపేట, కంభం, పామూరు, వెలిగండ్ల మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా వలంటీర్లకు వైఎస్సార్ సీపీ నేతలు సంఘీభావం ప్రకటించారు. వలంటీర్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు పవన్‌కళ్యాణ్ చౌకబారు రాజకీయాలు చేయడం తగదన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో అవగాహన లేకుండా మాట్లాడుతున్న పవన్‌కు దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని కాంక్షించారు.



కనిగిరిలో పవన్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న వలంటీర్లు



తాళ్లూరులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు



ముండ్లమూరులో వలంటీర్ల నిరసన



త్రిపురాంతకంలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం



బేస్తవారిపేటలో పోలీసులకు ఫిర్యాదు



పుల్లలచెరువులో పవన్ దిష్టి బొమ్మ దహనం



వెలిగండ్లలో ఎస్సైకి ఫిర్యాదు..



కిమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదాల అశోక్‌బాబు



చిన్నారి మృతదేహాన్ని బయటకు తెస్తున్న పోలీసులు



క్రేన్ సాయంతో క్షతగాత్రులను రక్షిస్తున్న పోలీసులు, స్థానికులు

క్షతగాత్రులకు అండగా..

దర్శి/ముండ్లమూరు/కురిచేడు/ఒంగోలు అర్బన్/ఒంగోలు టౌన్: దర్శి వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో క్షతగాత్రులు ఒంగోలులో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కిమ్స్‌లో నలుగురు, వెంకట రమణ ఆస్పత్రిలో ఇద్దరు చికిత్స కోసం చేరారు. అందరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్ కాలికి తీవ్రమైన గాయం కావడంతో కుటుంబ సభ్యుల మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. దీంతో కిమ్స్‌లో ముగ్గురు మాత్రమే చికిత్స తీసుకుంటున్నారు. సబీర్‌ముల్లాకు మోకాలులో రక్తం గూడు కట్టుకుందని, ఎటువంటి ఆపరేషన్ అవసరం లేదని వైద్యులు తెలిపారు. యాజ్దానీకి మాత్రం పక్కటెముక, తుంటి ఎముక పాక్షికంగా విరిగిందని ఆపరేషన్ అవసరం లేకుండా నయమవుతుందన్నారు. సలీమున్నీసాకు కూడా ఎడమ ఛాతిలో గాయం అయిందని నాలుగు రోజులు పర్యవేక్షించాల్సి ఉందన్నారు. ఒంగోలులోని కిమ్స్, వెంకట రమణ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదాల అశోక్‌బాబు పరామర్శించారు. వీరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

ప్రమాద సంఘటన బాధాకరం

■ జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, జంకె వెంకటరెడ్డి

బస్సు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందటం బాధాకరమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని, దర్శిలో మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కూడా సంఘటనకు గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదంలో తీవ్రగాయాలైన వారిని 108 వాహనాల్లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొందరి పరిస్థితి విషమించటంతో ప్రత్యేక వాహనాలలో ఒంగోలు, అమరావతి తరలించారు. అక్కడ వైద్యులతో ఫోను ద్వారా సంప్రదించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాయి రాజేశ్వరరావు, మర్రిపూడి వాకా వెంకటరెడ్డి, కొనకనమిట్ల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మెట్టు వెంకటరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ వెన్నా హనుమారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కె.వి.రమణారెడ్డి, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు డి.శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, జిల్లా కార్యదర్శి జి.చెన్నారెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ప్రమాద ఘటనలో బాధితులకు, మృతుల కుటుంబాలకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ భరోసా ఇచ్చారు. బస్సు ప్రమాద సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం దర్శి ప్రభుత్వ వైద్యశాలలోని మృతదేహాలను పరిశీలించి క్షతగాత్రులను పరామర్శించారు. వారికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యాన్నిచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై పోలీసు, రవాణా, రోడ్లు భవనాల అధికారులతో జాయింట్ కమిటీని నియమించి సంఘటనకు గల కారణాలను పరిశోధన చేయాలని ఆదేశించామని, ఆ కమిటీ నివేదిక ఆధారంగా ఎవరైనా సంఘటనకు బాధ్యులై ఉంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సంఘటన జరిగిన వెంటనే 100 కు ఫోన్ వచ్చిందని, రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్‌బీ, రవాణా, 108 వాహన సిబ్బంది, వైద్య సిబ్బంది అప్రమత్తమై ఆ ప్రాంత ప్రజల సహకారంతో ప్రమాద బాధితులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించారని ఆయన తెలిపారు.మృతుల్లో ఒకరికి వైఎస్సార్ బీమా వర్తిస్తుందని తెలిపారు. మిగతా వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి తో మాట్లాడి సహాయం అందేలా చూస్తానని పేర్కొన్నారు.

10 నిముషాల్లో బస్సు ఎక్కుదామని...

బస్సులో 37 మంది ప్రయాణిస్తున్నారు. దర్శిలో స్టాంప్ రైటర్ ముల్లా బాషా కుటుంబీకులు ముగ్గురు బస్సు ఎక్కాల్సి ఉంది. వారు బస్సు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ప్రమాదం జరిగిన వార్త వారు జీర్ణించుకోలేక పోయారు. మరో పది నిమిషాల్లో తాము కూడా ఈ బస్సు ఎక్కేవారమని..ప్రమాదం జరగడం దురదృష్టకరమని బాష కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

దర్శి ప్రమాదంపై ప్రముఖుల దిగ్భ్రాంతి:

ప్రమాద ఘటనపై ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ సుప్రజారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ బాష, ఎస్‌డీపీఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ సత్తార్, ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రఫీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా: ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

బస్సు ప్రమాదం వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన దర్శి వెళ్లిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు. క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం పొదిలిలో విలేకర్ల సమావేశంలో కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడారు. ప్రమాద విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఒక్కొక్క మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ప్రకారం ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని దరగాలో మంగళవారం జరిగింది. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు..గ్రామంలో నివాసం ఉంటున్న దండు రంగస్వామి భార్య దండు అనసూయ (21) ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పరిశీలించి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతికి కారణాలు పోలీసుల తేలాల్సి ఉంది.

లక్ష గడపల్లో సంతోషం చూశా..



దాకా పిచ్చిరెడ్డితో కలిసి కేక్ కట్ చేస్తున్న వరికూటి దంపతులు



భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న వరికూటి, పార్టీ నేతలు

- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- కె.ఉప్పలపాడులో లక్ష గడపలు పూర్తయిన సందర్భంగా సంబరాలు
- టంగుటూరు నుంచి ఉప్పలపాడు వరకు భారీ బైక్ ర్యాలీ
- ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు, పార్టీ శ్రేణులు

కొండపి/టంగుటూరు: 'గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ఎంతో సంతోషంగా ఉంద'ని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లక్ష గడపలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాకా పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. తొలుత టంగుటూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి కె.ఉప్పలపాడు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వరికూటి అశోక్‌బాబు దంపతులకు దాకా పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. తొలుత వైఎస్సార్ పార్కు వద్ద దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి దాకా పిచ్చిరెడ్డితో కలిసి అశోక్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అర్హులెవరూ నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజా బలంతో వైఎస్సార్ సీపీ 175 స్థానాలను కైవసం చేసుకోవడం తథ్యమని చెప్పారు. అందరం కలిసికట్టుగా కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. జగనన్న ఆశీస్సులతో లక్ష గడపలు పూర్తి చేసుకోవడం సంతోసంగా ఉందన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు.

లోకేశ్‌కు చెంబులతో స్వాగతం చెబుదాం

కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్వామి అభివృద్ధి చేయకపోగా పేదల మరుగుదొడ్లను సైతం వదలకుండా కోట్లాది రూపాయలను షాడో ఎమ్మెల్యే సత్యతో కలిసి దోచుకున్నాడని విమర్శించారు. లోకేశ్ పాదయాత్రకు చెంబులతో స్వాగతం చెప్పేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే స్వామి, సత్య మరుగుదొడ్ల అవినీతిని లోకేశ్ ఎదుట బట్టబయలు చేద్దామన్నారు. తదతనంతరం గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆర్.దయామణి, ఎంపీటీసీ దాకా విజయలక్ష్మి, వాకా శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మారెడ్డి అరుణవెంకటాద్రిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గొట్టిపాటి మురళి, పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, పోకూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. భారీ బైక్ ర్యాలీలో ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు సూదనగుంట వెంకటస్వామి, అనంతవరం సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, మేదరమిట్ల భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అరెస్టు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో మట్కా బుకీగా వ్యవహరిస్తున్న మహిళను పోలీసును సెబ్ అధికారులు సోమవారం అర్ధరాత్రి అదుపులోనికి తీసుకున్నారు. అందిన వివరాల ప్రకారం..రాచర్ల గేటు సమీపంలో ఓ గృహంలో ఓ మహిళ మట్కా బుకీగా వ్యవహరిస్తుండటంతో దాడులు నిర్వహించి ఆమె వద్ద నుంచి రూ.99 వేల నగదు స్వాధీనం చేసుకొని అదుపులోనికి తీసుకున్నట్లు పేర్కొన్నారు.